ఘనంగా శివపార్వతుల కల్యాణం



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి పార్వతి సమేత రాజరాజేశ్వరి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ ఆవరణలో స్వామి వారి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. పెద్దఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో హంపి విరూపాక్ష జగద్గురు శంకరాచార్యులు శ్రీవిద్యారణ్య భారతి స్వామి, ధర్మకర్తలు కౌన్సిలర్ సరిత మల్లేష్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యూహనుమాన్‌నగర్ కాలనీ నూతన కమిటీ



అసోషియేషన్‌ను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని న్యూహనుమాన్‌నగర్ కాలనీ నూతన అసోసియేషన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కొమ్మోరి బాల్‌రెడ్డి, కోశాధికారిగా శ్రవణ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా సరస్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కందుల శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా చంద్రశేఖర్‌శర్మ, గణేష్, ఉపాధ్యక్షులుగా పి.రమేష్, అబ్బయ్య, సహాయ కార్యదర్శిగా ఎల్లారెడ్డి, శ్రీను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి అభినందించారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయం అందజేస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



మాట్లాడుతున్న కౌన్సిలర్ చింతల రాజశేఖర్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో 3వ వార్డు కౌన్సిలర్ చింతల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఐజీ కాలనీని అందంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. మున్సిపల్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెత్తాచెదారాలను ఇష్టారాజ్యంగా పారేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వాణి మాట్లాడుతూ.. ప్రతి బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయడానికి రెండు డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటిలో వేసిన చెత్తను మున్సిపల్ సిబ్బంది సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు అర్జున్, కాశీనాథ్, ఆంజనేయులు, ప్రకాష్, బుచ్చయ్య, రాజు, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీహెచ్ భద్రారెడ్డి, పల్లె నర్సింగరావు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చైర్‌పర్సన్..?

- ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పయనమెటు?
- కాంగ్రెస్‌లో చేరతారని సోషల్ మీడియాలో చక్కర్లు
- బీఆర్ఎస్ నాయకుల వర్గపోరే కారణమని పుకార్లు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కుమ్ములాటలు పతాకస్థాయికి చేరుకున్నట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మెజారిటీ బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో గెద్దె నెక్కిన చైర్ పర్సన్ కలతచెంది త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అందుకు బీఆర్ఎస్‌లోని అంతర్గత కుమ్మలాటలు, అధిపత్యపోరే కారణమైనట్లు తెలుస్తోంది. మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు కారు గుర్తుపై గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఇటీవల అవిశ్వాసం పెట్టాలని పావులు కదిపారు. అవిశ్వాసంపై నీళ్ల చల్లకుండా స్థానిక ఎమ్మెల్యే కావాలనే ప్రోత్సహించారని, అవిశ్వానికి పచ్చ జెండా ఊపారన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి. కొందరు నాయకులు చైర్ పర్సన్‌పై లేనిపోనివి చెప్పి ఎమ్మెల్యేను తమ వైపు తిప్పుకున్నారని ప్రజలు అనుకుంటున్నారు.

చైర్ పర్సన్‌ను దూరం చేసిన నాయకులు..

స్థానిక ఎమ్మెల్యే గతంలో మంత్రిగా ఉన్నప్పుడు పలు అభివృద్ధి పనులకు చైర్ పర్సన్ లేకుండానే ఒకసారి శంకుస్థాపన చేశారు. అలాగే మొన్న కొర్రెముల్‌లో జరిగిన మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి కేటీఆర్ సభ అనంతరం పట్టణంలోని ఓ కుటుంబానికి చైర్ పర్సన్ లేకుండా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు.

ముందస్తు సూచికలు..

రాజకీయ జీవితానికి పునాది వేసిన ఘట్‌కేసర్‌కు చెందిన ఓ మాజీ సర్పంచ్, చైర్ పర్సన్‌కు దగ్గరి బంధువులైన గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, అతడి భార్య కార్పొరేటర్ శ్రీదేవి ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన గృహజ్యోతి పథకం అవగాహన కార్యక్రమంలో చైర్‌పర్సన్ నేరుగా పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలపడం చూస్తుంటే చైర్ పర్సన్ కాంగ్రెస్‌లో చేరడం ఖాయం అనిపిస్తుంది. చైర్ పర్సన్ కాంగ్రెస్‌లో చేరతారో? బీఆర్ఎస్‌లోనే ఉంటారో, త్వరలో తేలనుంది. అప్పటి వరకు వేచిచూడాల్సిందే..

దేవుడి భూములకు రక్షణ

- కొత్త ప్రభుత్వం ఆదేశాల నేపథ్యం లో కసరత్తు
- గ్రేటర్‌సహా శివారు జిల్లాల్లో 21,386 ఎకరాల దేవాదాయ భూములు
- కబ్జాదారుల ఆధీనంలో 5,462 ఎకరాలు
- కోర్టుల్లో వివాదాల్లో 760 కేసులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లోని దేవాదాయ, ధర్మాదాయ భూముల పరిరక్షణకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అధికార యంత్రాంగం దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక కార్యాచరణకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే దేవాలయాల వారిగా సంబంధిత భూములపై సమగ్ర సమాచారంపై ఆరా తీస్తున్నారు. కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న దేవాదాయ భూములకు సంబంధించిన కోర్టు కేసులను పునః పరిశీలించడంతోపాటు త్వరలో పరిష్కారం అయ్యేలా తీసుకోవాల్సిన చర్యలు, విధి విధానాలపై కూడా కార్యాచరణ రూపొందించాలని యంత్రాంగం భావిస్తోంది.

ఆక్రమణలో 5,462 ఎకరాలు

గ్రేటర్‌తో సహా రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో మొత్తంగా దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు 21,386 ఎకరాలు ఉండగా, ఇందులో 5,462 ఎకరాల భూములు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. ఇందుకు ఉదాహరణగా మేడ్చల్ జిల్లాలోని దేవరయాంజల్‌లో సీతారామచంద్రస్వామి భూముల కబ్జాను సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వివిధ కోర్టుల్లో 760 కేసులు

నగర శివారుల్లో కబ్జాదారుల ఆక్రమణల్లో ఉన్న దేవాదాయ భూములకు సంబంధించి 760 కేసులు వివిధ కోర్టుల్లో కొనసాగుతుండగా, వాటి పరిరక్షణపై ప్రత్యేక కసరత్తు చేస్తోంది. గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో ఇప్పటి వరకు 2,352 ఎకరాల భూములను వివిధ పద్ధతుల్లో పరిరక్షిస్తున్న దేవాదాయ శాఖ.. ముందస్తుగా తమ ఆధీనంలో ఉన్న భూముల రక్షణకు ఫెన్సింగ్ వంటి పటిష్టమైన చర్యలకు సిద్ధం కావాలని భావిస్తోంది.

దేవాదాయ భూములివే..

దేవాదాయ భూములకు సంబంధించి హైదరాబాద్ జిల్లాలో 5,217 ఎకరాలు ఉండగా, దీనికి సంబంధించిన భూములు మనరాష్ట్రంలో 2,500 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 354 ఎకరాల భూములు భద్రంగా ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 9,929 ఎకరాలు దేవాదాయ భూములు ఉండగా, మేడ్చల్ జిల్లాలో 3,941 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 2,299 ఎకరాలు దేవాదాయ శాఖ భూములు ఉన్నట్లు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాల నేపథ్యంలో తమ ఆధీనంలో ఉన్న భూముల పరిరక్షణకు దేవాదాయ శాఖ ప్రత్యేక చర్యల్లో భాగంగా ఫెన్సింగ్ వంటి కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని భావిస్తోంది.

కిడ్నాపర్‌గా భావించి వ్యక్తికి దేహశుద్ధి



బిహార్‌కు చెందిన వ్యక్తి ఉత్తమ్‌కుమార్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చాడని భావించి బీహార్‌కు చెందిన ఓ వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. సీఐ గోవర్ధన గిరి, ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం శివాన్ జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్(30) ఉపాధి కోసం నగరానికి వచ్చాడు. ఇక్కడికి వచ్చిన అనంతరం అతడు మద్యానికి బానిసయ్యాడు. ఉపాధి లభించకపోవడంతో తిరిగి బీహార్‌కు వెళ్లడానికి రైలు ఎక్కాడు. మద్యం మత్తులో ఉండటం, టికెట్ లేకపోవడంతో రైల్వే టీటీ అతడిని ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో దించేశాడు. దీంతో రైల్వే స్టేషన్ సమీపంలోని గాంధీనగర్ కాలనీకి వెళ్లాడు. అనుమానస్పదంగా కనిపించడం, స్థానికులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకపోవడంతో పిల్లలను ఎత్తుకెళ్లే కిడ్నాపర్‌గా భావించి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడు తెలిపిన వివరాలు ప్రకారం అతడి సొంతూరు సర్పంచ్, స్థానిక పోలీస్ స్టేషన్ జర్దాయి పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉపాధి లభించపోవడంతో ఇంటికి వెళ్తున్న తరుణంలో టీటీ రైలులో నుంచి దించివేసినట్లు తెలుసుకున్నారు. అతడు సొంతూరు వెళ్లేందుకు ఘట్‌కేసర్ పోలీసులు ఆర్థిక సాయం అందజేసి తిరిగి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు పంపించారు.

రాముడి బాటలో నడవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న స్వామీజీ

మేడ్చల్: సమాజంలో ప్రతి ఒక్కరూ రాముడి బాటలో నడవాలని త్రిదండి అహోబిలం రామానుజ జీయర్ స్వామి అన్నారు. మేడ్చల్‌లో రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాముడి జీవితం అందరికీ ఆదర్శమని ఆయన నడిచిన బాటలో అందరూ నడిస్తే సమాజం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ప్రపంచ దేశాలు భారత సనాతన ధర్మాన్ని ఆచరిస్తున్నాయని అన్నారు. ప్రతి పౌరుడు సనాతన ధర్మం పట్ల అంకిత భావంతో ఉండాలన్నారు. సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు, వివిధ హిందూ సంఘాల నాయకులు అప్పలరాజు, సుదర్శన్‌రెడ్డి, కిషన్‌రావు, సుధాకర్‌రెడ్డి, మురళీధర్‌గుప్తా, రఘురాం, మల్లికార్జునస్వామి, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు



తూర్పు రాజగోపుర నిర్మాణ శంకుస్థాపనలో సాయిధామం పీఠాధిపతి రామనంద ప్రభూజీ

కీసర: నాగారం సత్యనారాయణ కాలనీలోని శ్రీరమాసత్యనారాయణస్వామి ఆలయంలో తూర్పు రాజగోపురం నిర్మాణ శంకుస్థాపన పూజా కార్యక్రమాలను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. సాయిదత్త పీఠాధిపతులు(సాయిధామం) శ్రీస్వామి రామనందప్రభూజీ, మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ సుమిత్ర సురేష్, ఆలయ కమిటీ సభ్యులు హరగోపాల్, రాంచందర్, శ్రీనివాస్ రెడ్డి, వాడపల్లి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఉమాశంకర్, వేదవతి, బద్రీనారాయణ, పవన్ కుమార్, కాలనీ అసోషియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సభ్యులు నాగరాజు, శ్రీనివాస్, బద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాచవానిసింగారంలో అక్రమ కట్టడాల కూల్చివేతలు



ఘట్‌కేసర్: కాచివానిసింగారంలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు జేసీబీ సాయంతో ఆదివారం కూల్చివేయించారు. గ్రామంలోని సర్వే నంబర్-66లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన మూడు బేస్‌మెంట్ కట్టడాలు, ఒక గదిని కూలిచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ సాయిరాం మాట్లాడుతూ తహసీల్దార్ డీఎస్ రజనీ ఆదేశం మేరకు ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను కూల్చివేశామన్నారు. అక్రమాలు చేపట్టిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



కీసర: క్రెడిట్ కార్డు వ్యక్తుల వేధింపులను భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన రాగుల సురేష్‌కుమార్, భాగ్య మృతదేహాలకు ఆదివారం కీసర మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సాయి సంజీవ్‌నగర్ కాలనీలో బీజేపీ సీనియర్ నేత సురేష్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో వృద్ధులు, చిన్నారులు సేదతీరేందుకు వీలుగా సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

జవహర్‌నగర్‌లో నేడే అవిశ్వాసం

- బందోబస్తు మధ్య బల నిరూపణ
- ఉత్కంఠకు తెరతీసిన మేయర్ ఎన్నిక
- జవహర్‌నగర్‌లో నేడు 144 సెక్షన్



జవహర్‌నగర్: ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అవిశ్వాస పరీక్ష జరిగే రోజు రానే వచ్చింది. దీంతో జవహర్‌నగర్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రెండు వర్గాలకు చెందిన కార్పొరేటర్లు క్యాంపుల్లో జోష్‌గా తిరుగుతూ సోమవారం నిర్వహించనున్న అవిశ్వాస పరీక్షా సమయానికి రానున్నారు. జవహర్‌నగర్‌లో మొత్తం 28 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో మేయర్‌కు వ్యతిరేకంగా 19 మంది, మేయర్ కావ్యకు అనుకూలంగా ఏడుగురు, తటస్థంగా కాంగ్రెస్ కార్పొరేటర్ ఉండగా, 16వ డివిజన్ కార్పొరేటర్ మరణించిన విషయం తెలిసిందే. మేయర్ కుర్చీకి పోటీ పడే వ్యక్తికి కనీసం 18 మంది సరిపోతారు. కానీ 19 మంది అనుకూలంగా ఉండటంతో విజయం దాదాపు ఖాయమైనట్లే..

చక్రం తిప్పుతున్న మాజీ ఎమ్మెల్యే..

అవిశ్వాస ప్రక్రియలో మాజీ ఎమ్మెల్యే పరోక్షంగా చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. అవిశ్వాస పరీక్ష నెగ్గిన తర్వాత 19 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి 28వ వార్డు కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్‌ను మేయర్ పీఠంపై కూర్చొబెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. జవహర్‌నగర్ మేయర్ పీఠంపై సీఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. దీంతో మేయర్ పదవి కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లిపోతుందని పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది.

మేమే నెగ్గుతామంటున్న మేయర్ వర్గం..

అవిశ్వాసం వీగిపోతుందని ప్రస్తుత మేయర్ మేకల కావ్య వర్గం ధీమా వ్యక్తం చేస్తోంది. వ్యతిరేక వర్గంలో కొందరు వ్యక్తులు తమకే మద్దతు తెలుపుతారని విశ్వసిస్తున్నారు. ఓ బడా నాయకుడితో డీల్ కుదరకపోవడమే అవిశ్వాసానికి తెరతీశారని మండి పడుతున్నారు.

ఉదయం 11 గంటలకే అవిశ్వాసం..

భారీ బందోబస్తుతో సోమవారం ఉదయం 11 గంటలకు జరిగే అవిశ్వాస పరీక్షతో మేయర్ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు తెరపడనుంది. కార్పొరేషన్ అభివృద్ధికి అవిశ్వాసం అడ్డంకిగా మారిందని, నేటితో ఆ అడ్డంకి తొలగిపోతుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్‌లో 144 సెక్షన్ కొనసాగుతుంది.

అసమ్మతి కార్పొరేటర్లపై దాడులు..?

అవిశ్వాస బల నిరూపణ కోసం మేము జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చేరుకుంటున్న తరుణంలో పెద్ద అంబర్‌పేట చెక్‌పోస్ట్ వద్ద సుమారు 50 మంది గుర్తు తెలియని వ్యక్తులు దాడికి యత్నించారని అసమ్మతి కార్పొరేటర్లు ఆరోపించారు. మేయర్ వర్గానికి చెందిన వారే తమపై దాడి చేశారని డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆరోపించారు. మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి కారు అద్దాలను కూడా ధ్వంసం చేశారని పలువురు ఆరోపించారు. అక్కడికి వచ్చిన వారిలో కావ్య సోదరుడిని తాము చూసినట్లు వారు తెలిపారు. ముగ్గురిని గాయపరిచినట్లు వారు చెప్పారు. దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని మేయర్ సోదరుడు భార్గవరామ్ అంటున్నారు.

- పెద్దఅంబర్ పేట వద్ద తమపై దాడి చేశారంటూ జవహర్‌నగర్‌కు చెందిన అసమ్మతి కార్పొరేటర్లు ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.
- జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య బాబాయ్ భిక్షపతి కర్ణాటక రాష్ట్రం నుంచి రౌడీలను తీసుకొచ్చి తమపై దాడి చేయించాడని వారు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి



ఆర్‌జీకే కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పణ

కీసర: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం 100వ వారం జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కీసరలో అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పణలో భాగంగా ఆదివారం(108వ వారం) కీసర 108 వాహన సిబ్బంది చిత్రం రవి, ఆంజనేయులు మహేందర్, కుమారస్వామిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

ఘట్‌కేసర్: అంబేద్కర్ బహుజన వర్గాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి అని గోర్ సంక్షేమ సంఘం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు రాములునాయక్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దాస్, నర్సింగ్‌రావు, రాజేశ్‌కుమార్, సంతోశ్‌కుమార్, గణేశ్, నారాయణ, సత్యం, వెంకటేశ్వర్‌రావు, కృష్ణంరాజు, ఉపేందర్, విష్ణు, సచిన్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న రాములునాయక్

మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికలకు కసరత్తు

- పోలింగ్ కేంద్రాల ఏర్పాటు.. ఉద్యోగుల వివరాల నమోదుకు చర్యలు
- పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు
- త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండటంతో.. బదిలీల ప్రక్రియపై దృష్టి
- మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 37.28 లక్షలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని ఎల్బీనగర్, హైదరాబాద్ జిల్లాలోని కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నెల ఆఖరి వారం లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనే ధీమాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి విడత తనిఖీని ఈ నెల 5 నుంచి 15 వరకు నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో యంత్రాల పనితీరును పరిశీలించేందుకు నమూనా పోలింగ్ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా మూడేళ్లకు పైగా విధులు నిర్వహించిన డీఆర్డీవో, డీపీవో, జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈఓ, ఏసీపీలు, తహసీల్దారు, ఎంపీడీవోలు, ఎస్సైలు, పురపాలక కమిషనర్లు, ఇతర సిబ్బందిని బదిలీ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు

పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అర్హులైన వారికి ఓటుహక్కు కల్పించారు. మార్పులు చేర్పులు, అభ్యంతరాలు పరిశీలించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 8న తుది ఓటర్ల జాబితా విడుదల చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 37,28,519 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు..

- పోలింగ్ శాతం పెంచేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు నమూనా ఈవీఎంలను పంపించారు. ఓటు ఎలా వేయాలో ఓటర్లకు వివరిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఓటింగ్ పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఉద్యోగుల వివరాలు నమోదు

ఎన్నికల విధులు నిర్వహించేందుకు ఆయా శాఖల నుంచి ఉద్యోగుల వివరాలు సేకరించారు. ఉద్యోగి పేరు, హోదా, శాఖ, వారి సొంత నియోజకవర్గం.. తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిస్తారు. పోలింగ్ కేంద్రంలో పనిచేసే సిబ్బందితో పాటు ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీవీటీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నారు. విధులు నిర్వర్తించే సిబ్బందికి త్వరలో శిక్షణలు ఇవ్వనున్నారు.

- మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఓటర్లు 37,28,519 కాగా, పోలింగ్ కేంద్రాలు 3,241 ఉన్నాయి. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 28,75,907 మంది ఓటర్లు కాగా, పోలింగ్ కేంద్రాలు 2,439 ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 6,00,552 మంది ఓటర్లు 570 పోలింగ్ కేంద్రాలు, హైదరాబాద్ జిల్లా పరిధిలోని కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,52,060 మంది ఓటర్లు ఉండగా, 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా పెరగవచ్చని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అసెంబ్లీ నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
మేడ్చల్	6,58,190
మల్కాజిగిరి	4,99,536
కుత్బుల్లాపూర్	7,12,756
కూకట్‌పల్లి	4,71,878
ఉప్పల్	5,33,544
ఎల్బీనగర్	6,00,552
కంటోన్మెంట్	2,52,060
మొత్తం ఓటర్లు	37,28,519

- తుది ఓటరు జాబితా ప్రకారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య ఈ విధంగా ఉంది.